సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



ఆర్టీసీ బస్సుల్లేక కష్టాలు
జిల్లా నుంచి 260 బస్సులను కూటమి సభకు తరలించడంతో ప్రయాణికులు, ఉద్యోగులు రెండో రోజూ అష్టకష్టాలు పడ్డారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,12,,690
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,133
మూడు శాతం జీఎస్టీతో	రూ.10,437
నవర (8 గ్రాములు)	రూ.83,496

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 39.5 /29.4

జిల్లాలో గురువారం ఉరుములు, మెరుపులతో మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు పడే అవకాశం ఉంది. బుధవారం గాలిలో తేమ 58 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌తో నేదురుమల్లి భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడం, భవిష్యత్ కార్యాచరణపై విషయాలు చర్చించారు.

ప్రసన్నతో కొండూరు మర్యాద పూర్వకంగా..



ప్రసన్నకుమార్‌రెడ్డికు మొక్క అందజేస్తున్న కొండూరు అనిల్‌బాబు

కోవూరు: మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని బుధవారం కొండూరు అనిల్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కొండూరు అనిల్‌బాబును కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా నియమించారు. ఈ నేపథ్యంలో ప్రసన్నకుమార్‌రెడ్డిని కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఏఓ కె వేణుగోపాల్, సీఐ సుభాషిణి, తమ సిబ్బందితో కలిసి సిండికేట్ ఫార్మర్స్ సొసైటీతోపాటు ఇతర ప్రైవేట్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో ఎరువుల నిల్వల రికార్డులను పరిశీలించారు. అనంతరం సిండికేట్ ఫార్మర్స్ సొసైటీలో ఎరువుల నిల్వలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలు, అక్కడ ఉన్న స్టాక్‌కు తేడాలు ఉండడంతో తాత్కాలికంగా ఎరువుల సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మకాలు చేసినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏఓ కిశోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలపై దూసుకెళ్లిన మినీలారీ

- మహిళ మృతి, ముగ్గురికి గాయాలు



వాయిల మంగమ్మ మృతదేహం

గుడ్లూరు: రోడ్డు పక్కన నిలబడి ఉన్న కూలీలను మినీలారీ ఢీకొనడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని గుడ్లూరు సమీపంలో ఉప్పుటేరు బ్రిడ్జి వద్ద బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం తుమ్మలపెంటకు చెందిన పల్లెకారులు జామాయిల్ పొట్టు లోడు చేయడానికి గుడ్లూరు వచ్చారు. తిరిగి ఇంటికి బయలు దేరేందుకు బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కనే మహిళలు పని దుస్తులు మార్చుకుంటుంటున్నారు. అదే సమయంలో కందుకూరు నుంచి గుడ్లూరు వైపు కట్టెల లోడుతో వస్తున్న మినీ లారీ వేగంగా వస్తూ మహిళలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వాయిల మంగమ్మ (45) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మీ, జాలమ్మ, పోలమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గుడ్లూరులోని పీహెచ్‌సీకి తరలించారు. మంగమ్మ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్సై సుబ్బారావు తెలిపారు.

ప్రయోగం.. బూటకం

- వారానికి బైపీసీలో 8, ఎంపీసీకి 4 క్లాసులు నిర్వహించాలి
- ల్యాబుల్లో బూజు దులపని వైనం
- ప్రభుత్వ కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి
- ప్రథమ సంవత్సరం నుంచే ప్రాక్టికల్స్
- పర్యవేక్షించాల్సిన ఇంటర్‌బోర్డు అధికారులు
- మామూళ్లతో కన్నెత్తి చూడని వైనం



ఇంటర్ తరగతులు ప్రారంభించి వంద రోజులు పూర్తి

ఇంటర్ బోర్డు అధికారుల అవినీతి దాహం.. కళాశాలల యాజమాన్యాల ధనార్జనే ధ్యేయం విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారం చేస్తోంది. రసాయన శాస్త్రం సబ్జెక్ట్‌పై తరగతి గదుల్లోనే ప్రయోగాలతో అవగాహన కల్పించాల్సి ఉండగా ప్రహసనంగా మార్చేస్తున్నారు. ఇంటర్‌లో ప్రాక్టికల్ పరీక్షలు విద్యార్థుల మేధస్సుకు, భవిష్యత్‌కు గీటురాయి. అటువంటి కీలకమైన ప్రయోగాలను బూటకం చేస్తున్నారు. బట్టీ కొట్టుడు చదువులకు ప్రాధాన్యమిస్తున్నారు. కళాశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రాక్టికల్స్‌కు ప్రత్యేక తరగతులు నిర్వహించాలనే నిబంధనలు ఉన్నా.. నేటికీ ఒక్క ప్రయోగం చేయించినా దాఖలాలు లేవు. అనేక కళాశాలల్లో కనీసం ల్యాబ్‌లు కూడా లేవంటే అతిశయోక్తి కాదు. ఏ కళాశాలలోనూ ఇంత వరకు ల్యాబ్‌ల్లో బూజు దులిపిన పాపాన పోలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పరీక్షల షెడ్యూల్ ప్రకటించినప్పుడే మొక్కుబడిగా నిర్వహిస్తారు. కానీ పరీక్షల్లో మాత్రం విద్యార్థులకు సంపూర్ణ మార్కులు వేసి దగాకు పాల్పడుతున్నారు.



నెల్లూరు (టౌన్): జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నాయి. ఇంటర్ కళాశాలలు ప్రారంభమై వంద రోజులు గడిచాయి. ఇప్పటికే సిలబస్‌లో సగానికి పైగా పూర్తి చేశారు. అయితే ఇంటర్‌లో అత్యంత కీలకమైన ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించిన పాపాన పోలేదు. ఏ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలోనూ ఇప్పటికీ ల్యాబ్‌ల బూజు దులపని పరిస్థితి నెలకొంది.

ల్యాబ్‌ల్లేవు.. రసాయనాలు లేవు

జిల్లాలో అత్యధిక ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ల్యాబ్‌లే లేవు. ఇంటర్ విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలు ప్రాక్టికల్స్ జోలికి వెళ్లకుండా కేవలం థియరీపైనే దృష్టి సారిస్తున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం కూడా ఒక్క పైసా నిధులు విడుదల చేయకపోవడంతో ప్రాక్టికల్స్‌కు రసాయనాలు లేక విద్యార్థులు చెల్లించిన ఫీజులోనే కొనాల్సిన పరిస్థితి ఉంది. కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించడం లేదని తెలిసినా వారిచ్చే మామూళ్లతో జిల్లా ఇంటర్‌బోర్డు అధికారులు మిన్నకుంటున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

వారానికి ఒక్కో సబ్జెక్టుకు రెండు క్లాసులు

జిల్లాలో 185 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 119 కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన ఎంపీసీ విద్యార్థులు 36 వేల మంది, బైపీసీకి చెందిన విద్యార్థులు 7 వేల మందికి పైగా చదువుతున్నారు. అకడమిక్ సిలబస్ ప్రకారం ప్రథమ సంవత్సరం నుంచే బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉంది. బైపీసీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటని, జువాలజీ, ఎంపీసీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లు ఉంటాయి. వారానికి ఒక్కో సబ్జెక్టుకు రెండు ప్రాక్టికల్స్ పిరియడ్లు నిర్వహించాలి. ఈ లెక్కన ప్రతి వారం బైపీసీ విద్యార్థులకు 8, ఎంపీసీ విద్యార్థులకు 4 ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించాల్సి ఉంది. అయితే ప్రాక్టికల్స్ తరగతులు విస్మరించి థియరీ క్లాసులకే పరిమితమవుతున్నారు. దీంతో విద్యా సంవత్సరం ముగిసే వరకు ప్రాక్టికల్స్ అంటే విద్యార్థులకు తెలియని పరిస్థితి ఉంది. పరీక్షలకు 10 రోజుల ముందు ల్యాబ్‌లను పరిచయం చేస్తున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో మాస్ కాపీయింగ్ పేరు చెప్పి ఒక్కో విద్యార్థి నుంచి సబ్జెక్ట్‌కు రూ. 300 నుంచి రూ.400 వసూలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న విద్యార్థులు (ఫైల్)

అన్ని కళాశాలలను తనిఖీ చేస్తున్నాం

జిల్లాలో అన్ని జూనియర్ కళాశాలల్లో ల్యాబ్‌లకు సంబంధించి తనిఖీలు నిర్వహిస్తాం. ఇప్పటికే కొన్ని కళాశాలలను తనిఖీ చేశాం. కొన్నిట్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. మరికొన్నింటిలో నిర్వహించడం లేదు. ల్యాబ్‌లు వినియోగించని కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. ప్రతి జూనియర్ కళాశాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ల్యాబ్‌ల్లో రసాయనాలు లేకపోతే నివేదిక పంపించమని చెప్పాం.

– వరప్రసాదరావు, ఆర్ఐఓ

మామూళ్ల మత్తులో ఇంటర్‌బోర్డు అధికారులు

జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాకుండా యాజమాన్యాల ఇష్టారాజ్యంగా కళాశాలలను నిర్వహించుకునేందుకు యాజమాన్యాలు ఇంటర్‌బోర్డు అధికారులుకు రూ.లక్షల్లో మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో వారు మిన్నకుంటున్నారని చెబుతున్నారు.. ఏ ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలోనూ ప్రాక్టికల్స్ నిర్వహించడం లేదని తెలిసినా అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ విషయంపై ఎవరైనా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రాక్టికల్స్‌తోపాటు నాణ్యమైన బోధన అందించే విధంగా చూడాలని కోరుతున్నారు.

ప్రసన్నకు కాకాణి పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు నియోజకవర్గ సమన్వయకర్త నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడారు. అక్రమ కేసులు పెట్టి వేధించినంత మాత్రాన తమ పార్టీ నేతలు, కార్యకర్తలు భయపడబోరని చెప్పారు. నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రాహిన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ వెన్న ధర పెంపు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): పాడి రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా వెన్న ధరలు పెంచుతూ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. నగరంలోని వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీలో బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. గేదె పాలకు కేజీ వెన్నకు రూ.790 నుంచి రూ.800కు పెంచారు. ఈ పెరిగిన ధర ఈ నెల 16వ తేదీ నుంచి అమల్లోకి రానుంది.


వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలకు వివిధ హోదాల్లో నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం తెలిపింది. రాష్ట్ర ఐటీవింగ్ జోనల్ ప్రెసిడెంట్‌గా గొడ్డేటి వెంకటసుబ్బయ్య (ఆత్మకూరు), జాయింట్ సెక్రటరీగా ముడియాల మురళీకృష్ణారెడ్డి (ఉదయగిరి), రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీగా కోటు కోటిలింగం (కందుకూరు) నియమితులయ్యారు.

నిండు కుండలా సోమశిల

- 71 టీఎంసీలు దాటిన సామర్థ్యం
- నేటి నుంచి పెన్నకు వరద జలాలు విడుదల



సోమశిల జలాశయం

ఆత్మకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా వరప్రదాయని సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. జలాశయానికి 18,506 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా బుధవారానికి 71 టీఎంసీలకు నీరు చేరుకుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు. తాజాగా జలాశయంలో 74 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేసి, అదనపు జలాలను దిగువకు విడుదల చేయనున్నట్లు జలాశయ అధికారులు పేర్కొన్నారు. సెప్టెంబరు మొదటి వారానికే 70 టీఎంసీలకు సోమశిల జలాశయం చేరడం, జిల్లా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రానున్న మూడు నెలలు వర్షాలు కురవనున్న నేపథ్యంలో నిండుకుండలా ఉన్న సోమశిల జలాశయం నిర్వహణపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఉత్తర, దక్షిణ కాలువలకు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం తదితర అవసరాలకు 11,500 టీఎంసీలు దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తి సామర్థ్యానికి చేరువ కానున్న క్రమంలో గురువారం నుంచి పెన్నానదికి నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు పెన్నా పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తంగా చేయాలని ఆయా గ్రామాల, మండలాల రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. జలాశయం నుంచి దిగువకు నీరు విడుదల చేయనున్న క్రమంలో పెన్నా పరీవాహక గ్రామాల ప్రజలు సమీపంలోని పొలాలకు, పశువుల మేతకు తోలుకెళ్లొద్దని అధికారులు కోరారు.

రాష్ట్రానికి కొత్తగా 1,050 ఎలక్ట్రిక్ బస్సులు

- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



అధికారులతో కలిసి డిపోను సందర్శిస్తున్న ఎండీ

ఉదయగిరి: రాష్ట్రానికి త్వరలో కొత్తగా 1,050 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆయన బుధవారం ఉదయగిరి ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ ప్రాంతంలో స్త్రీశక్తి పథకం అమలుతీరు, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులు సిబ్బందితో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్త్రీశక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఎలక్ట్రిక్ బస్సులతోపాటు మరో 1,500 బస్సులు కొనుగోలు చేయనున్నాయన్నారు. ఫలితంగా ప్రయాణికుల రద్దీని తట్టుకోగలమన్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఆక్యూపెన్సీ రేషియో పెరిగిందన్నారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ మంచి పేరు తేవాలన్నారు. గతంలో 40 శాతం ఉన్న మహిళా ప్రయాణికుల శాతం ప్రస్తుతం 65 శాతం పైబడిందన్నారు. బస్టాండ్లలో మహిళలకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈడీ జోన్–3 నాగేంద్ర ప్రసాద్, ఈడీఓ అప్పలరాజు, ఆర్ఎం షమీమ్, డిప్యూటీ సీటీఎం రమేష్, ఆర్టీసీ అధికారులు ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 70,828 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,296 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.07 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 19 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

‘అన్నదాత పోరు’ విజయమే నిదర్శనం



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే తదితరులు

- కూటమి ప్రభుత్వ అసమర్థతతోనే రైతులు రోడ్డెక్కాల్సి వచ్చింది
- ఉద్యమాన్ని అణచి వేసేందుకు పోలీసులతో ఆంక్షలు
- ఎక్కడికక్కడ అడ్డుకున్నా.. రైతుల రాకతో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుతో రైతులు కదం తొక్కారని, ‘అన్నదాత పోరు’ విజయవంతమే కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్లే రైతులు రోడ్డెక్కాల్సి పరిస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. ఉద్యమంతో ప్రభుత్వ బండారం బయట పడుతుందనే అణచివేసేందుకు పోలీసులతో అడుగడునా ఆంక్షలు, అడ్డంకులు సృష్టించిందని విమర్శించారు. ఎక్కడికక్కడ అడ్డుకున్నా.. రైతుల రాకతో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టమైందన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నియోజకవర్గ ఇన్‌చార్జిలు, రైతు సంఘ నాయకులతో కలిసి కాకాణి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ నెల్లూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు, సూళ్లూరుపేట, కందుకూరు రెవెన్యూ డివిజన్లలో పెద్ద ఎత్తున రైతులు కదం తొక్కారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు ప్రజల పక్షాన నిలబడి ప్రజల సంక్షేమం కోసం నిరసనలు చేస్తాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే పిలుపునకు అన్ని వర్గాల నుంచి ప్రతి స్పందన వస్తుండడంతో కూటమి ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలను అడ్డుకునేందుకు పోలీసులను ఉసిగొలిపి ప్రజలు రాకుండా నిలువరించే ప్రయత్నం చేస్తోందన్నారు.

రైతులు, రైతు సంఘాల నేతలకు నోటీసులు, హౌస్ అరెస్టులు దారుణం

అర చేతిని అడ్డు పెట్టి సూర్య కాంతిని అడ్డుకోలేరని ‘అన్నదాత పోరు’తో కూటమి ప్రభుత్వానికి స్పష్టమైందన్నారు. పోలీసులను ప్రయోగించి ప్రజలను, వైఎస్సార్‌సీపీ నేతలను, రైతులను హౌస్ అరెస్టులు చేయడం దారుణమన్నారు. అర్ధరాత్రి సమయంలో నోటీసులు పంపించి, షరతులు అనుసరించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 15 మంది కంటే ఎక్కువ పాల్గొనకూడదని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదు, ఐదుగురికి మాత్రమే అనుమతి ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. మీడియా ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు నమోదు చేస్తామని గొంతు నొక్కేందుకు ఇలాంటి షరతులు విధించారన్నారు. పోలీసులు విధులను విస్మరించి, శాంతిభద్రతలను గాలికి వదిలేసి ప్రజలను అణగదొక్కే కొద్దీ ప్రజా వ్యతిరేకత ఎక్కువవుతుందన్నారు.

కూటమి నేతల దోపిడీ వల్లే యూరియా కొరత

కూటమి నేతలు దోపిడీ వల్లే యూరియా కొరత ఏర్పడిందని కాకాణి మండిపడ్డారు. రైతుల గురించి ఆలోచన చేయమంటే, కూటమి నేతలకు ఎందుకు కోపం వస్తుందో అర్థంకావడం లేదన్నారు. 50 శాతం కంటే ఎక్కువగా ప్రైవేట్ వారికి యూరియా ఎందుకు ఇచ్చారని వ్యవసాయ శాఖ మంత్రిని ప్రశ్నించారు. ‘యూరియా ఏదయ్యా’! అంటూ పచ్చ మీడియానే ప్రచురిస్తుంటే.. చంద్రబాబు మాత్రం యూరియా గురించి మాట్లాడితే ఖబడ్దార్ అనడం సిగ్గు చేటన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయడం లేదనే ప్రశ్నకు చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. నియోజకవర్గాల్లో అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన నియోజకవర్గ ఇన్‌చార్జిలు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కోవూరు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూమనతో వైఎస్సార్‌సీపీ జిల్లా నేతల భేటీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డితో జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం భేటీ అయ్యారు. భూమన నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు.



కాకాణి నివాసంలో భూమనతో భేటీ అయిన జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు

మీడియా స్వేచ్ఛను అణచి వేయడమే..



కూటమి ప్రభుత్వ అక్రమాలు, అవినీతితోపాటు పాలకుల పక్షపాత వైఖరిని ప్రజల పక్షాన నిలబడి 'సాక్షి' పత్రిక కథనాలు రాస్తే దాని కార్యాలయాలపై దాడులు చేయడం, ఏకంగా ఎడిటర్ రాకాసి ధనంజయరెడ్డిపై అక్రమ కేసు నమోదు చేయడం సరికాదు. ఇది పూర్తిగా మీడియా స్వేచ్ఛను హరించడమే. సమాజ హితం కోసం నిజాలు రాస్తే పోలీసులతో అక్రమ కేసు పెట్టించడం గతంలో ఎన్నడూ జరగలేదు. పోలీసు అధికారులకు జరుగుతున్న నష్టంపై రాసిన కథనాన్ని అడ్డం పెట్టుకుని కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమో ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఇలాంటి దుర్నీతి చర్యలను ఇకనైనా మానుకోవాలి.

– వల్లూరు వెంకటేశ్వర్లు,
ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి



వార్తలు రాస్తే కేసులు పెట్టిన చరిత్ర ఉందా?

మీడియా లేకుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలోకి వెళ్లిపోతుంది. పాలనలో మిగతా మూడు స్తంభాలైన వ్యవస్థల బాధ్యత ఎంత ఉందో.. నాలుగో స్తంభమైన మీడియా బాధ్యత కూడా అంతే ఉంది. వార్తలు రాస్తే నేరుగా కేసులు నమోదు చేసిన చరిత్ర ఇంత వరకు దేశంలో ఎక్కడా జరగలేదు. సాక్షి పత్రికలో సోదాలు చేయడం ఏమిటి? ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడం ఏమిటి? గతంలోనూ ఆయన ఇంట్లో అక్రమంగా సోదాలు నిర్వహించారు. అధికారంలో ఉన్న వారిపై వార్తలు రాస్తే అక్రమ కేసులు పెట్టి పోలీసులను పంపించి భయపెట్టాలని చూడడం మంచి పద్ధతి కాదు. తప్పుడు కేసును పోలీసులు తక్షణమే ఉపసంహరించుకోవాలి.

– జయప్రకాష్, ఏపీయూడబ్ల్యూజే,
కౌన్సిల్ మెంబర్



కూటమి సంబరం.. ప్రజలకు కష్టం

- ఆర్టీసీ బస్సుల్లేక రెండో రోజూ ప్రయాణికులకు తిప్పలు
- వెంకటగిరి జాతరకు వెళ్లేందుకు అష్టకష్టాలు
- విద్యార్థులు, ఉద్యోగులకు ఇబ్బందులు


నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

నెల్లూరు సిటీ: కూటమి నేతల సంబరం ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టింది. వివిధ పనుల నిమిత్తం ఊర్లకు వెళ్లాలని ఆర్టీసీ బస్టాండ్లకు చేరుకున్న వారికి ఎదురు చూపులే మిగిలాయి. అనంతపురంలో బుధవారం కూటమి పార్టీలు సూపర్ సిక్స్.. సూపర్ హిట్ బహిరంగ సభను నిర్వహించాయి. దీని కోసం మంగళవారమే జిల్లా నుంచి 260 ఆర్టీసీ బస్సులను పంపారు. దీంతో రెండు రోజులుగా ప్రయాణికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.

ఎంతోమంది

బుధవారం వేలాది మంది నెల్లూరులోని ప్రధాన, ఆత్మకూరు బస్టాండ్లకు చేరుకుని బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు. వచ్చిన అరకొర బస్సుల్ని ఎక్కేందుకు నానా తంటాలు పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇక విద్యార్థులు నెల్లూరు నగరానికి వచ్చేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక సాయంత్రం ఊర్లకు వెళ్లే సమయంలోనూ అదే పరిస్థితి. రెండు బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. చాలామంది ఆటోలను బాడుగకు మాట్లాడుకుని వెళ్లాల్సి వచ్చింది. ఇక పల్లెలకు వెళ్లేందుకు బిడ్డలతో వచ్చిన మహిళలు చాలాసేపు ఎదురు చూసి ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. నెల్లూరు నుంచి రోజూ తిరుపతికి వెళ్లే వారి సంఖ్య ఎక్కువే. వారు సైతం బస్సుల కోసం చెట్ల కింద గంటల సమయం వేచి చూశారు.

జాతరకు వెళ్లేందుకు..

ప్రస్తుతం వెంకటగిరిలో పోలేరమ్మ జాతర జరుగుతోంది. దీనికి నెల్లూరు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వెళ్తుంటారు. ఆర్టీసీ ప్రతి ఏడాది ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేస్తుంది. ఈసారి నెల్లూరు 1 డిపో నుంచి 10, రెండో డిపో నుంచి 5, రాపూరు నుంచి పది బస్సులు మాత్రమే కేటాయించారు. అరకొరగా వచ్చిన బస్సుల్ని ఎక్కేందుకు భక్తులు కష్టపడ్డారు. ఈ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగి ఉంటే కూటమి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి.


తిరుపతి, వెంకటగిరికి వెళ్లే బస్సుల్ని ఎక్కేందుకు తంటాలు పడుతూ..


ఆత్మకూరు బస్టాండ్‌లో ఎదురు చూస్తున్న జనం


ఊర్లకు వెళ్లేందుకు పల్లెవెలుగు బస్సు ఎక్కేందుకు కష్టపడుతూ..


బస్సు లేక తిరిగెళ్లిపోతూ..

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

'అరుణ చంపాలని చూస్తోంది'

- జీవితఖైదీ శ్రీకాంత్‌తో అనుచరుడు జగదీష్ ఫోన్ సంభాషణ
- సోషల్ మీడియాలో ఆడియో వైరల్

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో కొంత కాలంగా హాట్ టాపిక్‌గా మారిన రౌడీషీటర్ల వ్యవహారంలో రోజుకో కొత్త విషయం సంచలనం సృష్టిస్తోంది. తాజాగా బుధవారం 'అరుణ నన్ను చంపేందుకు ప్లాన్ చేస్తోందని' ఆమె మా జోలికి రావొద్దని చెప్పాలంటూ రౌడీషీటర్ జగదీష్ జీవిత ఖైదీ శ్రీకాంత్‌తో మాట్లాడిన సంభాషణకు సంబంధించిన ఆడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో మళ్లీ జిల్లాలో కలకలం రేగింది. ఈ ఫోన్ సంభాషణకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. జగదీష్.. శ్రీకాంత్‌కు ఫోన్ చేసి రాజశేఖర్ కూడా కాన్ఫరెన్స్ కాల్‌లో ఉన్నాడని, అరుణ తనను హత్య చేసేందుకు కపాడిపాళేనికి చెందిన కొంతమందిని సంప్రదించిందని చెప్పాడు. ఆమె తన జోలికి రాకుండా చూడాలని కోరాడు. దీనికి శ్రీకాంత్ స్పందిస్తూ నీ వల్ల ఎంతోమంది జీవితాలు నాశనమయ్యాయని, ఇది మంచి పద్ధతి కాదని జగదీష్‌ను శ్రీకాంత్ హెచ్చరించి ఫోన్ కాల్ కట్ చేశాడు. వెంటనే మరో రౌడీషీటర్ రాజశేఖర్‌కు ఫోన్ చేయడంతో అతను జగదీష్‌కు కాన్ఫరెన్స్ కాల్ కలిపాడు. రాజశేఖర్, శ్రీకాంత్ మధ్య మరోసారి సంభాషణ జరిగింది. అరుణ చేత అనేక పనులు చేయించుకుని ఆమెపైనే ఫిర్యాదు చేస్తారా? మరోసారి తనకు, అరుణకు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తే పద్ధతిగా ఉండదని హెచ్చరిస్తూ శ్రీకాంత్ ఫోన్ కట్ చేశారు. అరుణ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విషయాలను జగదీష్ ప్రస్తావించిన విషయం ఆడియో సంభాషణలో ఉంది. అయితే ఇది ఎప్పుడు జరిగిందనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

క్లుప్తంగా

వ్యక్తి దారుణ హత్య

- నిందితుల కోసం రెండు బృందాల ఏర్పాటు


శ్రీను మృతదేహం

లింగసముద్రం (కందుకూరు): మండలంలోని మొగిలిచర్లలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆవుల శ్రీను (48) భార్య చనిపోయింది. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాడు. శ్రీను ఇంటి వద్ద ఒంటరిగానే ఉంటున్నాడు. రోజులాగే మంగళవారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రపోయాడు. బుధవారం ఉదయం స్థానికులు చూసేసరికి మంచంపై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. శ్రీనుకు ఎవరితోనూ వివాదాల్లేవని, బంధువులతో ఆస్తి తగాదాలు కూడా లేవని చెబుతున్నారు. కాగా అతడికి మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఈ నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉంటుందనే గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

పొలంలో పని చేస్తుండగా..

- పాముకాటుకు వివాహిత మృతి


సంపూర్ణమ్మ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పాము కాటుతో వివాహిత మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని మునులపూడి పంచాయతీ రెడ్డిపాళెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గెండి సంపూర్ణమ్మ (47) పొలంలో పనికెళ్లి వస్తుండగా పాముకాటుకు గురైంది. గమనించిన స్థానికులు బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచింది. మృతురాలి భర్త వినయ్ ఐదు సంవత్సరాల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కూలికెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్న సంపూర్ణమ్మ చనిపోవడంతో పిల్లల భవిష్యత్ అంధకారంగా మారింది. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.133
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.238
స్కిన్‌లెస్ చికెన్ :	రూ.262
లేయర్ చికెన్:	రూ.210

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

మహిమాన్వితం.. మహోరూపం

- వైభవంగా ప్రారంభమైన వెంకటగిరి పోలేరమ్మ జాతర
- గ్రామదేవత దర్శనానికి పోటెత్తిన భక్తులు
- నేడు నగరోత్సవం.. నిమజ్జనం


పోలేరమ్మ ఆలయం

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తల్లి దీవెనల కోసం బుధవారం పట్టణం భక్తజనసంద్రంగా మారింది. పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి అంటూ భక్తుల నినాదాలు హోరెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే పట్టణంలోని ప్రతి ఇంట్లో పసుపుతో అమ్మవారి ప్రతిమను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబలిని నైవేద్యంగా సమర్పించారు.

వైభవంగా రథోత్సవం

కుమ్మరివీధిలోని పుట్టింట్లో పోలేరమ్మ ప్రతిమను తయారు చేశారు. విగ్రహానికి నేత్రాలను అమర్చకుండా రాత్రి 7:30 గంటల సమయంలో కొలువుదీర్చారు. అమ్మవారి ప్రతిమను తయారు చేసిన వెంటనే దర్శించుకుంటే మంచి జరుగుతుందనే నమ్మకంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అమ్మవారిని రథంపై కొలువుదీర్చి జీనిగలవారి వీధికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ప్రతిష్ఠించి సంప్రదాయబద్ధంగా గాలి గంగులకు పూజలు నిర్వహించారు. అనంతరం బలి కార్యక్రమం ముగిసిన తర్వాత అమ్మవారికి కళ్లు అమర్చారు. బుగ్గ చుక్కను తీర్చిదిద్దారు. దివ్యతేజస్సుతో అలరారుతున్న పోలేరమ్మ దివ్యరూపాన్ని రథంపై ఊరేగిస్తూ.. పాతకోట మీదుగా ఆలయానికి చేర్చారు. అక్కడ వేప మండలతో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో మహిమాన్విత ప్రతిమను ప్రతిష్ఠించారు.


క్యూలైన్‌లో భక్తులు

నేడు నిష్క్రమణం

జాతరలో భాగంగా గురువారం అమ్మవారి నిలుపు కార్యక్రమం మొదలవుతుంది. పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక మండపంలో అమ్మవారు కొలువుదీరుతారు. సాయంత్రం వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. అనంతరం వైభవంగా పోలేరమ్మ నగరోత్సవం నిర్వహిస్తారు. తర్వాత విరూప మండపం వద్ద అమ్మవారి నిష్క్రమణ కార్యక్రమం పూర్తి చేస్తారు. దీంతో జాతర ఘట్టం పరిపూర్ణమవుతుంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లాలోని వివిధ మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు.

బొలెరో – బైక్ ఢీకొని..


తలారి జయరామయ్య మృతదేహం

సంగం: మండలంలోని దువ్వూరు గ్రామ సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బొలెరో – మోటార్‌బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన తలారి జయరామయ్య (55) దువ్వూరు సమీపంలోని కనిగిరి రిజర్వాయర్ కింద ఏడెకరాల పొలం తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. తమ గ్రామానికి చెందిన ప్రవీణ్‌ను తీసుకుని బైక్‌పై వస్తున్నాడు. ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ డి.వెంకటరమణమ్మ విధి నిర్వహణలో భాగంగా బొలెరో వాహనంలో నెల్లూరుకు వెళ్తున్నారు. రెండు వాహనాలు దువ్వూరు సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో జయరామయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రవీణ్ తీవ్రంగా, వెంకటరమణమ్మ స్వల్పంగా గాయపడ్డారు. ఆమె వెంటనే స్పందించి 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ రాగా ప్రవీణ్‌ను అందులో ఎక్కించి నెల్లూరు ఆస్పత్రికి పంపారు. తలకు గాయకావడంతో వెంకటరమణమ్మను ఆటోలో తరలివెళ్లారు. బొలెరో డ్రైవర్ పెంచల నరసింహ స్వల్పంగా గాయపడ్డాడు. సంగం పోలీసులు జయరామయ్య మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బాధిత కుటుంబానికి అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

బైక్‌పై వెళ్తూ..


యువకుడి మృతదేహం

కోవూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కోవూరు సమీపంలో రామన్నపాళెం గేట్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. అసోం రాష్ట్రానికి చెందిన అర్మన్ నాయక్ (25) కోవూరు వైపు నుంచి రామన్నపాళెం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. రామన్నపాళెం గేట్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో నార్తురాజుపాళెం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మరో బైక్ ఢీకొట్టింది. దీంతో నాయక్ గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో మరో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో రామన్నపాళెం సచివాలయంలో పనిచేస్తున్న కరుణ ఉన్నారు. ఆమె తల, శరీరానికి గాయాలయ్యాయని సమాచారం. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కోవూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం కారణంగా కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

తక్కువ ధరకే గుండె స్క్రీనింగ్ పరీక్షలు


మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో ఆస్పత్రిలో తక్కువ ధరకే స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించామని ఆ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలిపారు. బుధవారం నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి, కార్డియాలజిస్టులు డా.షర్మిలి నౌషిన్, డా.నాగభూషణ్‌తో కలిసి శ్రీరామ్ విలేకరుల సమాశంలో మాట్లాడారు. సామాజిక బాధ్యతగా భావించి అక్టోబర్ నెలాఖరు వరకు రూ.11 వేల విలువైన 20 రకాల గుండె పరీక్షలను రూ.3,500లకే అందిస్తున్నామన్నారు. బీఎంఐ, సీబీసీ, బయోకెమికల్ పారామీటర్స్ విభాగంలోని షుగర్, క్రియాటిన్, యూరిక్ యాసిడ్, హెచ్‌బీఏ1సీ, టోటల్ కొలస్ట్రాల్, హెచ్‌డీఎల్, ఎల్‌డీఎల్, ట్రెగిజరైట్స్, ఈసీజీ, ఎకో, ఎక్స్‌రే, టీఎంటీ పరీక్షలతోపాటు ఉచిత డాక్టర్ కన్సల్టేషన్ అవకాశం కల్పిస్తున్నామన్నారు.

భార్య, బిడ్డకు వేధింపులు

- మంత్రగాడు చెప్పాడని కుమారుడిని బలిచ్చే యత్నం
- వ్యక్తి అరెస్ట్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అదనపుకట్నం కావాలని భార్యను వేధించమే కాకుండా గుప్తనిధుల కోసం క్షుద్రపూజల పేరుతో 9 నెలల వయసున్న కన్నబిడ్డను బలిచ్చేందుకు ప్రయత్నించిన వ్యక్తిని మంగళవారం రాత్రి నెల్లూరు దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. వారు బుధవారం వివరాలు వెల్లడించారు. నగరంలోని జాకీర్ హుస్సేన్ నగర్‌కు చెందిన సయ్యద్ ఖాజాసమీ అహ్మద్ అనే వ్యక్తికి గౌతంనగర్ రెండో వీధికి చెందిన షేక్ సుమయకు 2022 సంవత్సరంలో వివాహం జరిగింది. ఆ సమయంలో యువతి తల్లిదండ్రులు అహ్మద్‌కు రూ.10 లక్షల నగదు, 40 సవర్ల బంగారం, ఒక ప్లాట్ ఇచ్చారు. అయితే అతను ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్‌కు అలవాటుపడి నగదు, బంగారు నగలు అమ్మేశాడు. అదనపుకట్నం కావాలంటూ భార్యను వేధించేవాడు. ఈక్రమంలో గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు చేయాలని ఓ మంత్రగాడి సలహాతో తన 9 నెలల వయసున్న కుమారుడిని బలిచ్చేందుకు సిద్ధపడ్డాడు. గతేడాది జూన్ 9వ తేదీన అహ్మద్ బిడ్డను తీసుకెళ్లిన ఛాతి, కుడి తోడ మీద కాల్చాడు. ఈ విషయం తెలుసుకున్న సుమయ కుమారుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించింది. ఎవరికైనా చెబితే చంపేస్తానని భర్త బెదిరించాడని, అతని వల్ల తనకు, బిడ్డకు ప్రాణహాని ఉందని సుమయ ఇటీవల దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేశారు. నిందితుడిని అన్నమయ్య సర్కిల్ వద్ద అరెస్ట్ చేశారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గూడూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.2 లక్షల విలువైన 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ముందస్తుగా అందిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు, ఈగల్ టీమ్ సభ్యులు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా తిరుగుతూ పూరి – తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు సిద్ధమైన తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లాకు చెందిన తరుణ్, అజయ్, దిఘ్నేష్ గోపాలప్ప బ్యాగ్‌లను తనిఖీ చేశారు. 14 ప్యాకెట్లలో ఉన్న 10.100 కిలోల గంజాయి లభ్యం కావడంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో రైల్వే సీఐ సుధాకర్, నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన, తిరుపతి, నెల్లూరు, గూడూరు ఈగల్ టీమ్, సిబ్బంది సతీష్ బాబు, యోగానంద, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేపాల్‌లోని జిల్లావాసులకు రక్షణ

నెల్లూరు(అర్బన్): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని యుద్ధప్రాతిపదికన సురక్షితంగా వెనక్కి తీసుకు వచ్చేందుకు ఎమర్జెన్సీ సెల్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక విమానాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వాసులు ఎవరైనా నేపాల్‌లో ఉంటే ఈ క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలను నమోదు చేస్తే సహాయ, సహకారాలు అందిస్తామన్నారు.

క్యూఆర్ కోడ్

ద్విచక్ర వాహనదారుల కళ్లలో కారం

- లారీలో నుంచి కారప్పొడి రోడ్డుపై పడిన ఫలితం


కళ్లు తుడుచుకుంటున్న వాహనదారుడు

కొడవలూరు: ద్విచక్ర వాహనదారుల కళ్లలో కారం పడి తీవ్ర ఇబ్బందులు పడిన ఘటన మండలంలోని టపాతోపు క్రాస్ రోడ్డు వద్ద హైవేపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కారం పొడి బస్తాలతో లారీ గుంటూరు నుంచి చెన్నై వెళ్తోంది. పక్కనే వెళుతున్న క్రేన్ వాహనం బస్తాలకు తగిలింది. దీంతో కారప్పొడి రోడ్డుపై పడింది. అనేక గ్రామాల నుంచి హైవేకు చేరే క్రాస్‌రోడ్డు ప్రాంతం కావడంతో ద్విచక్ర వాహనాలు ఎక్కువగా వస్తుంటాయి. రోడ్డుపై పడిన కారం గాలికి ద్విచక్ర వాహనచోదకుల కళ్లలో పడటంతో ముందుకు సాగలేకపోయారు. ఎక్కడికక్కడ బండ్లను నిలిపివేశారు. సుమారు గంటకు పైగా ఈ పరిస్థితి ఉంది. హెల్మెట్ ధరించిన వారు సాఫీగా వాహనాలను నడుపుకొంటూ వెళ్లిపోయారు.